క్లుప్తంగా

జగనన్న పోరుబాటను విజయవంతం చేయాలి

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28న పొదిలి పట్టణంలో పొగాకు వేలం కేంద్రం సందర్శనను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఆ పార్టీ మండల నాయకులు పలు గ్రామాల్లో ప్రచారం చేట్టారు. మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం, పాతపాడు, నాగంపల్లి, సలనూతల, పెదారికట్ల, చినారికట్ల గ్రామాల్లో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెఉట్ల వెంకటరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, పార్టీ నాయకుడు ఉడుముల గురవారెడ్డి పర్యటించారు. జగనన్న పోరుబాట కార్యక్రమానికి రైతులు తరలివచ్చి సంఘీబావం ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం దిగివచ్చి రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేలా డిమాండ్ చేసేందకు రైతులంతా కదలిరావాలని విజ్ఞప్తి చేశారు.

కక్షతో విద్యుత్ స్తంభాలు పెకలింపు



జేసీబీతో పెకిలించి రోడ్డు పక్కన పడేసిన విద్యుత్ స్తంభాలు

బేస్తవారిపేట: ఓ రైతు తన పొలంలో డీప్ బోర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసుకున్న స్తంభాలను టీడీపీ సానుభూతిపరుడైన మరో రైతు పీకేశాడు. ఈ సంఘటన బేస్తవారిపేట మండలంలోని పూసలపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కర్నాటి చిన్న వెంకట సుబ్బారెడ్డి వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఆ శాఖ అధికారులు పది రోజుల క్రితం స్తంభాలు ఏర్పాటు చేశారు. సుబ్బారెడ్డి పొలం పక్కన ఇద్దరు రైతుల పొలాల మధ్య గట్టుపై రెండు స్తంభాలు పాతారు. టీడీపీ సానుభూతిపరుడైన రైతు తన పొలం గట్టుపై స్తంభాలు ఎందుకు వేశారంటూ జేసీబీతో పెకిలించి రోడ్డు పక్కన పడేశాడు. సాధారణంగా పొలాల్లో వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు పక్క పొలాల గట్ల వెంట స్తంభాలు వేస్తారు. టీడీపీ సానుభూతిపరుడైన రైతు పొలానికి కూడా అలాగే కనెక్షన్ ఇచ్చారు. అయితే కక్షపూరితంగా తోటి రైతును ఇబ్బంది పెట్టడంపై పలువురు రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రేషన్ కార్డులకు సర్వర్ ఇక్కట్లు

- సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్న దరఖాస్తుదారులు
- సర్వర్ మొరాయిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- నిబంధనలపై ఉద్యోగులు, సిబ్బందికి స్పష్టత కరువు
- జూన్ 7తో గడువు ముగియనుండటంతో అర్హుల్లో ఆందోళన



కంభంలో రేషన్ కార్డు దరఖాస్తు కోసం వేచి ఉన్న దరఖాస్తుదారులు

కంభం: నూతన రేషన్ కార్డులు, కార్డుల్లో మార్పు చేర్పుల కోసం పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన 11 నెలల తర్వాత రేషన్ కార్డుల వెబ్‌సైట్ తెరిచిన కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒక పక్క సర్వర్ సమస్య, మరో పక్క నిబంధనలు చికాకు పుట్టిస్తుండగా.. జూన్ 7వ తేదీతో వెబ్‌సైట్ మూతపడుతుందన్న ప్రకటన దరఖాస్తుదారులను ఆందోళనకు గురిచేస్తోంది.

సర్వర్ సమస్యతో ప్రజల ఇక్కట్లు

కార్యాలయ పనివేళల్లో రేషన్ కార్డుల వెబ్‌సైట్ సర్వర్ మొరాయిస్తుండటంతో సచివాలయాల సిబ్బంది తంటాలు పడుతున్నారు. పైగా ఒక్కో దరఖాస్తుకు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుండటంతో దరఖాస్తుదారులు పడిగాపులు కాస్తున్నారు. కంభం 2, 3, 4 సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో కంభం-2 సచివాలయ పరిధిలోని వారికి సచివాలయం-1లో సేవలు అందించే ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ ఉన్న వారికి పనిభారం అధికమైంది. కంభం 3, 4 సచివాలయాల్లో పనిచేసే ఇతర సిబ్బందికి బాధ్యతలు అప్పగించగా ఇతర పనులు చేస్తూనే, రేషన్ దరఖాస్తులను నెమ్మదిగా నమోదు చేస్తున్నారు.

ఈకేవైసీ చిక్కులు

నూతన రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారితోపాటు కార్డులో ఉండే సభ్యులందరూ కచ్చితంగా ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈకేవైసీ కాకపోతుండటంతో కార్డు దరఖాస్తు ప్రక్రియ పూర్తయిందో లేదో అర్థం కాక దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. అప్లికేషన్ పరిస్థితి తెలుసుకునేందుకు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

నిబంధనలపై స్పష్టత కరువు

కొత్తగా వివాహమైన వారు నూతన రేషన్‌కార్డులు దరఖాస్తు చేసుకోవాలన్నా, పాత కార్డులో నుంచి విడిపోవాలన్నా మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా కావాలని డిజిటల్ అసిస్టెంట్లు చెబుతుండటంతో దరఖాస్తుదారులు నానా తంటాలు పడుతున్నారు. కొందరు డిజిటల్ అసిస్టెంట్లు పెళ్లినాటి ధ్రువీకరణ పత్రాలు పెట్టి దరఖాస్తు చేస్తుండగా మరి కొందరు కచ్చితంగా మ్యారెజ్ సర్టిఫికెట్ కావాలని వెనక్కు పంపిస్తుండటం గమనార్హం. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకునేలోగా దరఖాస్తు గడువు ముగిసి నష్టపోతామని పలువురు ఆందోళన చెందుతున్నారు.

> **మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదు**
>
> కొత్తకార్డులు, మార్పులు చేర్పులకు మ్యారేజ్ సర్టిఫికెట్ కచ్చితం కాదు. ఇతర ధ్రువీకరణ పత్రాలు పొందుపరిచి సేవలు పొందవచ్చు. సర్వీసుల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలందించాలని సచివాలయ సిబ్బందికి సూచించాం.
>
> – వి.కిరణ్, తహసీల్దార్ కంభం

> **నా కూతురి పేరు తొలగించాలి**
>
> నా కూతురు ప్రభుత్వ వైద్యశాలలో కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తోంది. ఆమెకు ఏడాది క్రితం వివాహం చేశాం. రేషన్ కార్డులో నా కూతురి పేరు తొలగించాలని సచివాలయానికి వెళ్తే ఆప్షన్ లేదని చెప్పారు. ఆమె పేరు తొలగించపోతే నా కార్డు రద్దయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సవరణలకు అవకాశం కల్పించాలి.
>
> – షేక్ అన్వర్ బాషా, కంభం

> **దరఖాస్తుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలి**
>
> గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏ సంక్షేమ పథకమైనా వలంటీర్ల ద్వారా ఇంటివద్దే అందించే వారు. ప్రస్తుతం ఏ పథకం పొందాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. రేషన్‌కార్డు దరఖాస్తుల్లో సర్వర్ సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి.
>
> – గొంగటి చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, కంభం

అంధకారంలో కందులాపురం కాలనీ



వీధిలైట్లు వెలగక కాలనీలో అలుముకున్న చీకటి

కంభం: స్థానిక కందులాపురం పంచాయతీ పరిధిలో కందులాపురం కాలనీలో గత కొన్నిరోజులుగా వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ కాలనీలో సుమారు 150 గృహాలు ఉన్నాయి. అంతర్గత వీధుల్లో పలు స్తంభాలకు లైట్లు వెలగకపోవడంతో గాఢాంధకారం నెలకొంది. చీకటి పడితే గడప దాటే పరిస్థితి లేదని కాలనీ వాసులు చెబుతున్నారు. పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని, ఉన్నతాధికారులు స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేత



కుట్టుమిషన్లు అందజేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: మాతృశ్రీ ఈశ్వరమ్మ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రేడియో బావి సమీపంలో గల సత్యసాయి మందిరంలో ఆదివారం మహిళలకు కుట్టుమిషన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు సూరె అనంతరామయ్య మాట్లాడుతూ.. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే నలుగురు మహిళలకు కుట్టుమిషన్లు, ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి, నిర్వాహకులు శశికళ, బాలకృష్ణారెడ్డి, కె.భిక్షం, రాంమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కంభం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కంభం తాలూకా అధ్యక్షుడిగా ముక్కు ప్రసాద్‌రెడ్డి ఎన్నికయ్యారు. స్థానిక పెన్షనర్స్ భవనంలో ఆదివారం ఏపీజీఈఏ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా కె.పాండురంగారెడ్డి వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి ముక్కు ప్రసాదరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్‌డీ ప్రకాష్, సెక్రటరీగా రంగస్వామి, ఆర్గనైజేషన్ సెక్రటరీగా శివనాగప్రసాద్, ట్రెజరర్‌గా వెంకటరంగయ్య, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన కార్యవర్గాన్ని పలువురు ఉద్యోగులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

పొగాకు రైతులకు అండగా జగనన్న

- 28న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పొదిలి రాక
- రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పొదిలికి తరలిరావాలి
- కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మార్కాపురం నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం/తర్లుపాడు: పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు ఈనెల 28న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి పట్టణానికి రానున్నారని, కార్యక్రమానికి రైతులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మార్కాపురం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విడివిడిగా మార్కాపురం, తర్లుపాడు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తొలి ఏడాది పొగాకుకు మద్దతు ధర కల్పించేందుకు మార్క్‌ఫెడ్‌ను రంగలోకి దించారని, ఏడాదికి రూ.3 వేల కోట్లకు పైగా ధరల స్థిరీకరణ నిధి కేటాయించడంతో రైతులు లాభపడ్డారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నీ అమలు చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేశామని, ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో రైతులతోపాటు అన్ని వర్గాలను ఇబ్బంది పెట్టడం శోచనీయమన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరూ నిరుత్సాహ పడవద్దని భరోసా ఇచ్చారు. 28న పొదిలిలో వైఎస్ జగన్ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి రైతులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, మార్కాపురం, తర్లుపాడు ఎంపీపీలు లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మార్కాపురం జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాస రెడ్డి, పోరెడ్డి చెంచిరెడ్డి, తర్లుపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం: ప్రజలు లోన్‌యాప్, సైబర్ మోసాలు, చిట్టీల పేరుతో మోసపోవద్దని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పూలసుబ్బయ్య కాలనీలో ప్రజలకు వివిధ రకాల మోసాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. దిచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. వార్డుల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలు, బెల్టు షాపులకు దూరంగా ఉండాలని చెప్పారు.



అవగాహన కల్పిస్తున్న టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు

పశువుల షెడ్డు కూల్చివేత



మల్లవరంలో జేజేబీతో కూల్చి వేసిన షెడ్డు

పొదిలి రూరల్: ఓ కుటుంబం తాము కొనుగోలు చేసిన స్థలంలో ఏర్పాటు చేసుకున్న పశువుల షెడ్డును మరో వ్యక్తి జేసీబీతో కూల్చివేశాడు. ఈ సంఘటన పొదిలి మండలంలోని మల్లవరంలో శనివారం చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్మసాని కోటమ్మ, కొమ్మసాని వరలక్ష్మి, కొమ్మసాని సుజాత అదే గ్రామానికి చెందిన తాళ్లూరి ఎస్తేరమ్మ, కుడుముల దానమ్మ, తాళ్లూరి మార్తమ్మ, తాళ్లూరి అచ్చమ్మ, తాళ్లూరి భాగ్యమ్మ, తాళ్లూరి మేరమ్మ వద్ద 15 సెంట్ల స్థలాన్ని 2008 ఆగస్టు 2వ తేదీన కొనుగోలు చేసి, 2009 నవంబర్ 5వ తేదీన అగ్రిమెంట్ ద్వారా స్వాధీనం చేసుకున్నారు. అందులో పశువుల పాక ఏర్పాటు చేసుకున్నారు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన కాకర్ల శ్రీను కాటూరివారిపాలేనికి చెందిన కె.సంజవయ్య జేసీబీతో పశువుల షెడ్డును పడగొట్టాడు. ఎందుకు తొలగించారని అడిగితే అసభ్యంగా మాట్లాడి నెట్టేశారని బాధితులు వాపోయారు. రేకుల షెడ్డు కూల్చడం వల్ల సుమారు రూ.25 వేలు నష్టం జరిగిందని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.

విద్యార్థులకు చెస్ పోటీలు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు కథలు చెప్పడంతోపాటు ఇంగ్లిష్ గ్రామర్, డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.



చెస్ ఆడుతున్న విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 1993–95లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి సంగతులు గుర్తుచేసుకుని ఆటపాటలతో సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు విజభాస్కర్‌రెడ్డి, అన్నెం ఇంద్రసేనారెడ్డి, అన్నెం ప్రభాకర్‌రెడ్డి, చిలకల సుబ్బారెడ్డి, రామన్‌కుమార్ సింగ్, కృష్ణవేణి, తోట రమణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొండా రఘునాథరెడ్డి, భూపతిరెడ్డి, మధుసూదన్, రజనీకాంత్, లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

చక్కని చేతిరాతతో బంగారు భవిత

మార్కాపురం: చక్కని చేతిరాతతో మంచి మార్కులు సాధించి తలరాతను మార్చుకోవచ్చని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ టీవీ రామకృష్ణారావు, లైబ్రేరియన్ జీవీ శివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లయన్స్ క్లబ్ సహకారంతో హ్యాండ్ రైటింగ్‌పై రెండు రోజుల అవగాహన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. 23 మంది విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ ఇచ్చినట్లు ట్రైనర్ తిరుపాలయ్య తెలిపారు. అనంతరం లైబ్రేరియన్ శివారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశేఖర్‌రెడ్డి, తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



లైబ్రేరియన్ శివారెడ్డిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

పోరాటలతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు

గిద్దలూరు రూరల్: పోరాటల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన పేర్కొన్నారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆశావర్కర్ల యూనియన్ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, రిటైరైన ఆశా వర్కర్లకు పెన్షన్ ఇవ్వాలని, ఆశా వర్కర్ల పోస్టులను రాజకీయాలకు సంబంధం లేకుండా భర్తీ చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 7, 8వ తేదీల్లో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నూర్జాహాన్, రమాదేవి, అంజలి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షంతో రైతుల హర్షం



గొట్లగట్టు ప్రధాన వీధిలో ప్రవహిస్తున్న వర్షం నీరు

కొనకనమిట్ల/అర్ధవీడు: కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గొట్లగట్టు, చినమనగుండం, పాతపాడు, బచ్చలకూరపాడు, నాగంపల్లి, సలనూతల, వింజవర్తిపాడు గ్రామాల్లో వర్షం కురవడంతో లోతట్టు పొలాల్లో నీరు చేరింది. గొట్లగట్టు గ్రామ పంచాయతీ కార్యాలయం, మెయిన్ రోడ్‌పై వర్షం నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోహిణి కార్తెలో సాధారణంగా ఎండలు ఎక్కువ కాస్తాయి. అలాంటిది రోహిణి కార్తె మొదలైన ఆదివారం రోజే వర్షం పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

గాలివాన బీభత్సం

అర్ధవీడు మండలంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అంకభూపాలెం, పాపినేనిపల్లి, బొల్లుపల్లి, అచ్చెంపేట, అర్ధవీడు, నారాయణపల్లి, యర్రకుంట ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం పత్తి పైరుకు మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. వర్షాలు సకాలంలో కురవాలని పలు గ్రామాల్లో పోలేరమ్మకు పూజలు చేశారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

వీరాంజనేయస్వామికి విశేష పూజలు

మార్కాపురం టౌన్: మండలంలోని బొడిచర్ల గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వీరాంజనేయస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, అష్టోత్తర శతనామావళి, హనుమాన్‌చాలీసా పారాయణం, ఆకుపూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

వేడుకగా చౌడేశ్వరి అమ్మవారి కొలుపులు



చౌడేశ్వరి అమ్మవారు

కొనకనమిట్ల: మండలంలోని మునగపాడు గ్రామంలో చౌడేశ్వరిదేవి అమ్మవారి కొలుపులను ఆదివారం వేడుకగా నిర్వహించారు. మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. నాగేటి సాళ్లల్లో ఉద్భవించిన చౌడేశ్వరి అమ్మవారిని కొలిస్తే కాలం సుభిక్షంగా ఉంటుందని భక్తులు విశ్వసిస్తారు. ఆ విశ్వాసంతోనే మునగపాడు, సమీప గ్రామాలకు చెందిన వారు ఎక్కడ స్థిరపడినా ఉత్సవం రోజు వచ్చి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది.